క్లుప్తంగా

హనుమాన్ హోమం



హోమం నిర్వహిస్తున్న శిష్టు శ్రీరామశాస్త్రి

రాజమహేంద్రవరం రూరల్: ఋషి బ్రహ్మట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రాయుడుపాకలు గ్రామంలో పంచముఖ హనుమాన్ హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిష్టు శ్రీరామశాస్త్రి మాట్లాడుతూ పంచముఖ హనుమంతుడు పూర్ణ రుద్రావతార మూర్తి అన్నారు.

పర్యావరణ రక్షణకు సమష్టి కృషి



మొక్కలు నాటుతున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి చేయాలని రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి కోరారు. రాజమహేంద్రి మహిళా డిగ్రీ పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ఆధ్వర్యంలో మంగళవారం 42వ డివిజన్ మున్సిపల్ కాలనీలోని రత్నంపేట ఏరియాలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణ కృషి చేస్తేనే గ్లోబల్ వార్మింగ్ తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో కేఎస్‌వీ సుధారాణి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ కూలర్ వితరణ



వాటర్ కూలర్ అందిస్తున్న సూర్యనారాయణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): లయన్స్ క్లబ్ మహిళ సేవా మాసోత్సవంలో భాగంగా స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయానికి వాటర్ కూలర్ వితరణ చేశారు. నగరంలోని ఒక హోటల్‌లో మంగళవారం జోన్ చైర్మన్ వాణిశ్రీ సౌజన్యంతో లయన్ ఆఫ్ ది డిస్ట్రిక్ట్ వేలూరి సూర్యనారాయణ, వేలూరి సత్యవతి చేతుల మీదుగా లైబ్రేరియన్ శ్రీదేవికి అందించారు. లయన్ మాటూరి మంగతాయారు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బాపిరాజు చిత్రానికి అద్వానీ అభినందనలు

కంబాలచెరువు: ఎల్‌కే అద్వానీకి ఇటీవల భారత రత్న పురస్కారం అందజేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారతరత్న లోగోపై అద్వానీ తైలవర్ణ చిత్రాన్ని నగరానికి చెందిన చిత్రకారుడు, ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు డాక్టర్ పుప్పాల బాపిరాజు అందంగా చిత్రీకరించారు. ఆ చిత్రాన్ని అద్వానీకి పంపారు. దీన్ని చూసిన ఆయన కుమార్తె ప్రతిభ అద్వానీ బాపిరాజుకు తన తండ్రి తరఫున అభినందనలు తెలిపారు. ఆ వివరాలను బాపిరాజు మంగళవారం విలేకరులకు వెల్లడించారు.

పీఆర్‌సీ విడుదల చేయాలి

ప్రకాశం నగర్: ప్రభుత్వం పీఆర్‌సీని విడుదల చేయాలని జిల్లా ఏపీ గవర్నమెంట్ రిటైర్ ఉద్యోగుల అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. లాలాచెరువులో మంగళవారం అసోసియేషన్ జిల్లా సమావేశం జరిగింది. అధ్యక్షుడు, పళ్ల సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు మాట్లాడారు.

రూ.223 కోట్లతో 170 కిలోమీటర్ల రోడ్లు

మధురపూడి: నియోజకవర్గంలో రూ.223.57 కోట్లతో 37 పనుల ద్వారా 170 కిలోమీటర్లు రోడ్లు నిర్మించినట్టు రోడ్లు, భవనాల శాఖ డీఈ బీవీ మధుసూదనరావు తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ రోడ్లతో నియోజకవర్గానికి నూతన కళ వచ్చిందన్నారు. కోరుకొండ నుంచి సీతానగరం మండలం ముగ్గళ్ల వరకూ 14.3 కిలోమీటర్లు రహదారి నిర్మాణం జరుగుతోందన్నారు. బూరుగుపూడి జంక్షన్ నుంచి రాజానగరం వరకూ పది కిలోమీటర్ల రోడ్డు నిర్మించామన్నారు.

నేడు కల్యాణ మహోత్సవం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు కార్యనిర్వాహణాధికారి పాటి సత్యనారాయణ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఏకాదశిని పురస్కరించుకుని కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఈ నెల 8వ తేదీన మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

మహిళలకు కుట్టు శిక్షణ

రాజానగరం: దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మల్లంపూడిలో టైలరింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. ఈవూరి దుర్గ ట్రైనర్‌గా వ్యవహరిస్తున్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- రాజవోలులో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



రాజవోలు గ్రామంలో రైతుభరోసా కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్టు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు. రాజవోలు గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతుభరోసా కేంద్రం నూతన భవనాలను, గ్రామ సచివాలయం ప్రహరీని మంగళవారం ఆయన ప్రారంభించారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.61.80 లక్షలతో చేపట్టే పైపులైన్ల నిర్మాణానికి, రూ.60 లక్షలతో వివిధ ప్రాంతాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి, శ్మశాన వాటిక అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. ముందుగా గ్రామంలోని అంబేడ్కర్, మాజీ సర్పంచ్ నక్కా మాణిక్యం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. మంత్రి వేణు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటు అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. తాను ప్రతి ఒక్కరికి సేవకుడిగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస బాబు, ఏఈలు సంపత్ కుమార్, శ్రీనివాస్, వ్యవసాయాధికారి ఏ.భీమరాజు, ఈవోపీఆర్అండ్ఆర్డీ బాబూరావు, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, మాజీ ఎంపీటీసీ నక్కా శ్యాంబాబు, సొసైటీ చైర్మన్ గిరిజాల రామకృష్ణ, పార్టీ నాయకులు పెయ్యల రాజేష్, నక్కా రాజేంద్ర, బూసి కృష్ణ, జుత్తుక వసంత్, సింహాద్రి రామలక్ష్మి, పేట రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

స్వచ్ఛత మనందరి బాధ్యత

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, జగనన్న స్వచ్ఛ సంకల్పానికి అత్యంత ప్రాధాన్యత నిస్తూ సహకరించాలని మంత్రి వేణు కోరారు. రాజవోలు గ్రామంలో మంగళవారం స్వచ్ఛత మనందరి బాధ్యత కార్యక్రమంలో ఆయన పాల్గొని, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకుండా ఆయా గ్రామ పంచాయతీల పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు.

ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

- జేసీ తేజ్ భరత్
- ధవళేశ్వరంలో కేంద్ర సాయుధ బలగాల కవాతు



జెండా ఊపి కవాతును ప్రారంభిస్తున్న జేసీ తేజ్ భరత్

ధవళేశ్వరం: రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్, రూరల్ ఆర్‌ఓ తేజ్ భరత్ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం దక్షిణ మండల డీఎస్పీ అంబికా ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి ధవళేశ్వరంలో కవాతు నిర్వహించారు. ధవళేశ్వరం ఐటీసీఎల్ కాలనీ వద్ద జేసీ తేజ్ భరత్ జెండా ఊపి కవాతును ప్రారంభించారు. ఐటీసీఎల్ కాలనీ నుంచి ధవళేశ్వరంలోని పలు వీధులు మీదుగా సాగింది. జేసీ మాట్లాడుతూ భద్రతా పరంగా ఎన్నికల కమిషన్ తీసుకుంటున్న చర్యల నేపథ్యంలో జిల్లాకు కేంద్ర బలగాలు వచ్చాయన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కవాతు ప్రదర్శన నిర్వహించామన్నారు. కవాతులో సైనిక దుస్తులు ధరించిన చిన్నారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో 400 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు, ధవళేశ్వరం ఎస్సై వి.క్రాంతికుమార్, ఏఎస్సై ఎ.నాగేశ్వరరావు, హెచ్‌సీ మీసాల శ్రీను పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్‌లో వెబినార్

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి అధ్యక్షతన ఎకనామిక్స్, కామర్స్ డిపార్ట్‌మెంట్ నిర్వహణలో ఛాలెంజెస్ ఆఫ్ అంట్రప్రెన్యూవర్‌షిప్ ఆఫ్ ఇండియా అనే అంశంపై మంగళవారం నేషనల్ వెబినార్ జరిగినది. ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడుకు చెందిన కామర్స్ స్పీకర్ ప్రొఫెసర్ ఎ.చంద్రమోహన్ మాట్లాడుతూ అనేక రంగాలలో ఉత్తీర్ణత సాధించిన మహిళా ఉద్యమకారుల గురించి తెలిపారు.

న్యూఢిల్లీకి చెందిన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీకి చెందిన ఎకనామిక్స్ స్పీకర్ ప్రొఫెసర్ బత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థలో మహిళా ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సవాళ్లను విశ్లేషణలతో వివరించారు. ఈ వెబినార్ నిర్వహణకు అనుమతినిచ్చిన కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డాక్టర్ పోలా భాస్కర్, ఆర్జేడీ డాక్టర్ ఎస్.శోభారాణిలకు కృతజ్ఞతలను తెలిపారు.

పలువురు మహిళలకు సత్కారం



మహిళలను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: మహిళా దినోత్సవం (ఈనెల 8వ తేదీ) సందర్భంగా వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన పలువురు మహిళలను సత్కరించారు. స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. మన గుడి–మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి జాతీయ అధ్యక్షురాలు ధరణికోట దుర్గా వెంకట హైమావతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని, అనేక సేవలు అందిస్తున్నారన్నారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు ఆధ్వర్యంలో 80 వృద్ధులకు రూ.500 చొప్పున రూ.40 వేలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, కార్యదర్శి గుబ్బల గంగాభవాని, యోగా గురువు ఆళపు బాబాజీ పాల్గొన్నారు.

చిన్నారులందరికీ పోలియో చుక్కలు



వేమగిరిలో ఇటుక బట్టీల వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

కడియం: మండలంలోని శివారు ప్రాంతాల్లో నివసించే కుటుంబాల్లోని పిల్లలను సైతం గుర్తించి వైద్య సిబ్బంది మంగళవారం పోలియో చుక్కలు వేశారు. గత మూడు రోజులుగా పల్స్ పోలియో విస్తృతంగా నిర్వహిస్తున్న విషయం విదితమే. మూడో రోజు వైద్య సిబ్బంది ఇంటింటికీ సర్వేలో గుర్తించిన ఐదేళ్ల లోపు చిన్నారులు 48 మందికి, శివారు ప్రాంతాల్లోని వలస కార్మికుల చిన్నారులు 79 మందికి పోలియో చుక్కలు వేశారు. మండలంలో 97.58 శాతం మంది చిన్నారులకు పోలియో నివారణ చుక్కల మందును అందజేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ వైద్యులు జెస్సీ సుప్రియ, మణిజ్యోత్స్న, స్వరూప, నాగసాయిమౌర్య పర్యవేక్షించారు. మండలంలోని 17, 357 గృహాలను తమ సిబ్బంది సందర్శించి చిన్నారులను గుర్తించి, వారికి పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు.

బైబిలు మిషన్ మహాసభలు ప్రారంభం



ప్రార్థన చేస్తున్న కన్వీనర్ షారోన్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: మార్గాని ఎస్టేట్ గ్రౌండ్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న బైబిల్ మిషన్ 57వ మహా సభలు మంగళవారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెవరెండ్ మార్టిన్ ప్రార్థనతో ప్రారంభించగా, ఎన్.ఆనంద పాల్ అధ్యక్షుడిగా వ్యవహరించి నడిపించారు. కన్వీనర్ ఎస్‌జే షారోన్ కుమార్, ఆనంద కుమార్, టి.రత్నం రాజు, ఆగమన రాజు ప్రసంగించారు. సుదర్శన్ షాపింగ్ మాల్ అధినేత లావేటి సుదర్శన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే రాత్రి జాన్ జేసు రత్నం, బైబిల్ మిషన్ సెక్రటరీ వై.ఇమ్మానియేల్ (ఏలూరు), టి.ఆగస్టీన్ ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన వారందరికీ కో కన్వీనర్ సుదన షారోన్, లావేటి సుదర్శన్ అల్పాహారం, భోజనం, తాగునీరు ఏర్పాటు చేశారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కంబాలచెరువు: ఆల్కాట్ గార్డెన్స్‌కు చెందిన కె.వీర వెంకట సత్యనారాయణ గోదావరి బండ్ వద్ద మద్యం బాటిళ్లతో ఉండగా మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి పది బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ లింక్‌లను క్లిక్ చేస్తే అనేక అనర్థాలు

రాజానగరం: ఆన్‌లైన్‌లో వచ్చే లింక్‌లను క్లిక్ చేసి, అనర్థాలను కొనితెచ్చుకోవద్దని ఈస్ట్ జోన్ డీఎస్పీ ఎస్.కిషోర్ కుమార్ హెచ్చరించారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచికి వాడుకోవాలని, కానీ కొందరు తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటూ అమాయకులను బలిచేస్తున్నారన్నారు. సైబర్ నేరాలపై యువత పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. ఏ విషయంలోనూ ఇతరులకు వ్యక్తిగత బ్యాంకు అకౌంట్లు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు చెప్పరాదన్నారు. పొరబాటున ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలన్నారు. అలాగే మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికి సంక్షేమ పథకాలు

- మంత్రి చెల్లుబోయిన వేణు
- జక్కంపూడి రామ్మోహనరావు మల్టీపర్పస్ సెంటర్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వేణు, చిత్రంలో జక్కంపూడి విజయలక్ష్మి, చందన నాగేశ్వర్, గూడూరి శ్రీనివాస్ తదితరులు

కడియం: పేదల ఆర్థికాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అందజేస్తూ, వారి ఎదుగుదలకు తోడ్పడుతున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కడియపు సావరంలో రూ.52 లక్షలతో ఆధునీకరించిన జక్కంపూడి రామ్మోహనరావు మల్టీపర్పస్ సెంటర్‌ను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. మంత్రి వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం పారదర్శకంగా అందజేస్తోందన్నారు. అనంతరం మల్టీపర్పస్ సెంటర్‌ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతం శెట్టి వీరభద్రయ్య, పార్టీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్, జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, ఎంపీటీసీ సాపిరెడ్డి దుర్గా కామేష్, కడియపులంక సొసైటీ ప్రెసిడెంట్ తిరుమల శెట్టి శ్రీనివాస్, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

రాజమహేంద్రవరం రూరల్: టిడ్కో గృహాల లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ధవళేశ్వరం పంచాయతీ పరిధిలో టిడ్కో గృహాల సముదాయానికి వెళ్లే ప్రధాన రహదారిని రూ.40 లక్షలతో సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు పలు సమస్యలను మంత్రి వేణు దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో టిడ్కో గృహాల లబ్ధిదారుల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగ రీజినల్ కో ఆర్డినేటర్ నాగులపల్లి ఆశ, నాయకులు నారాయణరావు, ముత్యాలు, నగరపాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావు, ఈఈ శేషగిరిరావు, డీఈ ప్రకాశరావు, ఏఈ శ్రీధర్ పాల్గొన్నారు.

ఘనంగా మధునాపంతుల జయంతి

సీటీఆర్ఐ: తెలుగువారి చరిత్రను ఛందోమధురంగా తీర్చిదిద్ది ఆంధ్ర పురాణం మనకు అందించిన మహాకవి మధునాపంతుల అని సాహితీవేత్త డాక్టర్ సుంకర గోపాల్ అన్నారు. మంగళవారం గౌతమీ లైబ్రరీలో మధునాపంతుల ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి 104వ జయంతి సభలో గోపాల్ ప్రధాన ప్రసంగం చేశారు. ఆయన మాట్లాడుతూ శాతవాహనుల నుంచి నాయకరాజుల వరకూ మన చరిత్ర ఎలా పరిఢవిల్లినదీ ఆంధ్ర పురాణం రమ్యమైన పద్యాలలో వివరిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అరిపిరాల నారాయణరావు, మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, ఎస్.సూరిబాబు, డాక్టర్ రెంటాల వెంకటేశ్వరరావు, డాక్టర్ బులుసు వెంకట సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

అత్త అదృశ్యంపై అల్లుడి ఫిర్యాదు

కంబాలచెరువు: వై.రామవరానికి చెందిన పంగి ముద్రి (55) తన కుమార్తెకు డెలివరీ చేసేందుకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి అల్లుడితో కలిసి వచ్చింది. అయితే ఆమె ఈనెల 4వ తేదీ నుంచి అదృశ్యమైంది. దీంతో ఆమె అల్లుడి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

కాకినాడలోని రాయుడుపాలేనికి చెందిన ఓ యువతి టెట్ పరీక్ష రాసేందుకు ఆమె మావయ్యతో కలిసి రాజమహేంద్రవరంలోని రాజీవ్‌గాంధీ కళాశాలకు వచ్చింది. పరీక్ష అయిన తర్వాత ఆమె బయట కనిపించలేదు. దీంతో ఆమె మావయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బేడ బుడగ జంగాల సంక్షేమానికి కృషి



బేడ బుడగ జంగాల ఆత్మీయ కలయికలో మాట్లాడుతున్న మంత్రి వేణు, చిత్రంలో జక్కంపూడి విజయలక్ష్మి, డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: బేడ బుడగ జంగాల సంక్షేమానికి కృషి చేస్తానని జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బేడ బుడగ జంగాలల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరపల్లి ఏసు మిత్రబృందం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొంతమూరు బుడగ జంగాల కాలనీలో ఆత్మీయ కలయిక జరిగింది. ముఖ్యఅతిథులుగా మంత్రి వేణు, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు హాజరయ్యారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ కొంతమూరు బుడగ జంగాల కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ మంత్రి వేణు తమ కుటుంబంలో నుంచి వచ్చిన వ్యక్తి అన్నారు. మంత్రి వేణు మాట్లాడుతూ బేడ బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చే ప్రతిపాదనను అమలు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. స్థలాలు ఇచ్చే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. జంగాల కాలనీలో చర్చి, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్, వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా శ్రీనగేష్, స్థానిక నాయకులు కప్పిరి వెంకన్న, వీర్లపల్లి మార్కు, శివరాత్రి మహిమారావు, శివరాత్రి సిమోన్, వీర్లపల్లి సెరబందు, వీర్లపల్లి జాన్ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ కలయిక

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తానని మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. మంగళవారం రాజవోలు గ్రామంలోని జక్కంపూడి రామ్మోహనరావు కల్యాణ మండపంలో నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఆ సంఘం నాయకులు ఇచ్చిన వినతి పత్రాలను మంత్రి స్వీకరించి, వైఎస్సార్ సీపీ మరలా అధికారంలోకి రాగానే ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయీ బ్రాహ్మణులకు దేవస్థానం ట్రస్టుబోర్డు కమిటీలలో చోటు కల్పించడం జరిగిందన్నారు.

నరసింహస్వామి ఆలయంలో సుదర్శన యాగం



యాగం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన సతీమణి రాజశ్రీ

మధురపూడి: కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం అష్టముఖ గండ భేరుండ లక్ష్మీనరసింహస్వామి సుదర్శన యాగం ప్రారంభమైంది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన సతీమణి రాజశ్రీ చేతుల మీదుగా నిర్వహించారు. మూడు రోజులు పాటు ఈ యాగం జరగనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కోరుకొండలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విలేకరులతో మాట్లాడుతూ లోక కల్యాణార్థం ఈ యాగాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

మహా శివరాత్రికి విస్తృత ఏర్పాట్లు



కడియపులంక వద్ద ఏర్పాట్లపై స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

కడియం: నియోజకవర్గం పరిధిలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈనెల 8వ తేదీన జరగనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు ప్రముఖ శైవాలయాలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ఆయా ఆలయాల వద్ద విద్యుద్దీపాలంకరణలతో పాటు, శివయ్య దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

భారీగా రానున్న భక్తులు

ఇన్నీసుపేటలోని మహాకాళేశ్వరాలయం, ధవళేశ్వరం రామపాదాల రేవులోని అగస్త్యేశ్వరాలయం, కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి, దుళ్లలోని బాలా త్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరాలయం, కడియపులంక అపర్ణా సమేత అనంతేశ్వరాలయం, వీరవరం, మురమండ గ్రామాల్లోని సోమేశ్వరాలయం, జేగురుపాడులోని నగరేశ్వర స్వామి, వేమగిరి, మాధవరాయుడుపాలెం గ్రామాల్లో శివాలయాలను భక్తులు భారీ ఎత్తున దర్శించుకునేందుకు వస్తారు.

రథోత్సవాలు

కడియపులంక పాత పూలమార్కెట్‌లోని అభయాంజనేయస్వామివారి ఆలయం వద్ద ఏటా శివరాత్రి రోజు భారీ అన్నదానం జరుగుతుంది. కడియం, దుళ్ల గ్రామాల్లో స్వామివారి రథోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. వేలాది మంది భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ముఖ్యంగా కడియపులంక జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న అనంతేశ్వరాలయం, అభయాంజనేయ స్వామి ఆలయాలను వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ఆలయ కమిటీ, ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నారు.

డీఎస్పీ పర్యవేక్షణ

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాలకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చేపడుతున్న చర్యలను దక్షిణ మండలం డీఎస్పీ అంబికా ప్రసాద్ మంగళవారం పర్యవేక్షించారు. ఇన్నీసుపేటలోని మహాకాళేశ్వరాలయాన్ని ఆలయ నిర్మాత పట్టపగలు వెంకట్రావుతో కలిసి సందర్శించారు. కడియపులంకలోని అనంతేశ్వరాలయం, అభయాంజనేయ స్వామి ఆలయాలను పరిశీలించారు. ఆయా ఆలయాల వద్ద పార్కింగ్ ప్రదేశాలు, అన్నదానం తదితర ఏర్పాట్ల వివరాలను ఆయా ఆలయ కమిటీలను అడిగి తెలుసుకున్నారు. అలాగే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట ఆలయ కమిటీ చైర్మన్లు పల్ల సుబ్రహ్మణ్యం, మార్గాని సత్యనారాయణ, కడియం, రాజమహేంద్రవరం టూటౌన్ పోలీసు ఇన్‌స్పెక్టర్లు బి.తులసీధర్, శ్రీనివాస్, ఎస్ఐ టి.కృష్ణసాయి ఉన్నారు.

కబడ్డీ టోర్నమెంట్ విజేతగా తూర్పుగోదావరి



విజేతగా నిలిచిన తూర్పుగోదావరి జట్టు సభ్యులు

ఏయూ క్యాంపస్ (విశాఖపట్నం): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల వేదికగా జరుగుతున్న 70వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ కబడ్డీ పురుషుల కబడ్డీ పోటీల విజేతగా తూర్పు గోదావరి జిల్లా జట్టు నిలిచింది. మంగళవారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో జరిగిన ఫైనల్ పోటీలో తూర్పుగోదావరి, గుంటూరు జట్లు తలపడ్డాయి. రెండు జట్ల క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఒకానొక దశలో స్కోర్ సమమైంది. చివరి వరకు రెండు జట్లు సమానంగా పాయింట్లు సాధిస్తూ ఉత్కంఠగా ఆట సాగింది. చివరకు తూర్పు గోదావరి జిల్లా జట్టు 3 పాయింట్లతో గుంటూరుపై విజయం సాధించింది. విన్నర్, రన్నరప్ జట్లకు ట్రోఫీలను ప్రదానం చేశారు. మూడో స్థానాన్ని కృష్ణా, శ్రీకాకుళం జట్లు సంయుక్తంగా సాధించాయి. సాయంత్రం జరిగిన మొదటి సెమీఫైనల్‌లో శ్రీకాకుళంపై గుంటూరు, రెండో సెమీ ఫైనల్‌లో కృష్ణా జిల్లాపై తూర్పుగోదావరి విజయం సాధించి ఫైనల్స్‌కు చేరాయి. విజేతలకు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీకాంత్, విశాఖ జిల్లా కార్యదర్శి జేఎస్‌వీ ప్రసాదరెడ్డి, చీఫ్ పాట్రన్ ఎస్.రామకృష్ణారెడ్డి, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి ట్రోఫీలను ప్రదానం చేశారు. కబడ్డీ పోటీలను ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి సందర్శించి క్రీడాకారులను అభినందించారు.